# మామూలివ్వటం మానేశాడు ....

టి. ఆర్. ఆర్. ఆచారి

మేమిద్దరం ఒక సైకిలుమీదనే చచ్చిచెడి 6 గంటలయ్యేసరికి గూడూరునుంచి బందరు చేరుకున్నాం. నాలుగు బజార్లు జనంతో క్రిక్కిరిసి ఉన్నాయి. పోలీసులు యీలలు వేసుకుంటూ వచ్చేపోయే బండ్లను, రిక్షాలనూ దారిచూపిస్తున్నారు. సినీమావేళ అయిపోతుందని ఆడవాళ్ళకంటే మొగవాళ్లు మొగవాళ్ళకంటే ఆడవాళ్లు చంకల్లో పిల్లలను ఉంచుకొని పల్లెజనం పుట్టిముంచుకుపోతున్నట్లు పరుగెత్తుతున్నారు.

నేను శాస్త్రి అక్కడికి అరమైలుముందరే పోలీసులతో గోల పడలేమని సైకిలు దిగి సినీమా అందుకోవాలి చిలుము వదిలించుకోవాలి అని తొందరతొందరగా నడచి వస్తూ ఉన్నాము. సినీమా ప్రారంభించే వేళయింది. ప్రక్కసందుల్లో ఎవ్వరూ పోలీసులుండరు యిద్దరం ఎక్కి వెళ్లచ్చు అన్నాడు శాస్త్రి. సరే అని వెనక ఎక్కి కూర్చున్నాను. హాలు యింకా అరఫర్లాంగున్నదనగా వెనకనుంచి ఏయ్ ఆగండే అని కేకలు వినపడ్డాయి. శాస్త్రి వాటిని లెక్కచేయకుండానే తొక్కుతున్నాడు ఏమవుతోందోగదా అని నా గుండె గుభేలుమంటోంది.

హాలుదగ్గరకి చేరుకునేసరికి ఒకళ్ళమీద ఒకళ్లు పడుతూ టిక్కెట్లు తీసుకొనే కోలాహలంచూస్తే చాలా ఘోరంగా ఉన్నది. అంతా చొక్కాలు చిరిగినవాళ్ళు, చేతులు నలిగినవాళ్లు, కాళ్లు నలిగినవాళ్ళు.

శాస్త్రి ఆ గలభాలోకి మనం వెళ్లలేదే, చొక్కాలు చించుకోలేనే అని ఉబలాటపడుతూ ఫర్స్టులో డబ్బుతీసుకునేసరికి వెనకనుండి సైకిలుమీద ఒక పోలీసు సిద్ధమయ్యాడు. ఏయ్. పిలుస్తుంటే ఆగరేం. లైటులేకుండా సైకిలుమీద యిద్దరు ఎక్కివస్తున్నారా? పదండి స్టేషన్ కి అన్నాడు. మేము తెలియక ఎక్కాము అని నేను ఎంత అరుస్తున్నా నా మాట వినిపించుకోక మీ పేర్లేమిటి? మీ దేవూరు అని గర్జిస్తూ నడవసాగాడు. మేముకూడా నడవటం ప్రారంభించాం.

ఇంతలో ఒక కిళ్లీకొట్టుదగ్గరకు బీడీకాల్చుకునే వంకతో పోలీసు చేరుకున్నాడు. మేముకూడా వెనకాతే వెళ్ళాము.

చెప్పండయ్యా పేర్లు. లేకపోతే స్టేషన్ కు పదండి- దుకాణందారు—ఏమిటండీ ఆ కేసు? అని ఉన్న సంగతి తెలుసుకొని మమ్మల్ని పక్కకు పిలిచి పంతులుగారూ! వీళ్ళతో యీ గోలంతా ఎందుకు? పావలో బేడో మొఖాన పారవేస్తే పీడ వదలిపోతుంది- హాయిగా భోజనాల వేళకు యింటికి పోవచ్చు అని షావుకారు తెలివితేటలను వెళ్ళబోయటం ప్రారంభించి కానిస్టేబులుగారూ ఏదో తెలియక ఎక్కారుట- ఏదో—విడిచేయండి అని కోరాడు-

ప్రతిరోజూ యీ పోలీసు అక్కడే నిలబడి వచ్చేపోయేవాళ్లను ఏదో వంకతో పట్టుకొని కొట్టుదగ్గరకు తీసుకురావటం- షావుకారు రూపా దగ్గరనుంచి బీడీముక్కవరకూ బేరమాడి పోలీసుకు యిప్పించటము జరుగుతూ ఉంటుందట-

మా శాస్త్రి మెంకెవాడు. ఎట్లాగూ సినీమా చూడకుండా చేశారు. వీళ్లు తన్నుకుచచ్చినా దమ్మిడీ యివ్వకూడదు. ఇస్తే రేపు మేజస్ట్రీటుకే జరిమానా యిద్దాం అని. వచ్చినా చోటు పెట్టలేదు. చివరికి విసిగి కోపంవచ్చి కాఫీ త్రాగే యోగ్యం లేదనుకొంటూ మమ్మల్ని స్టేషనుకు తీసుకువెళ్ళి మా పేర్లు పూర్తి వివరాలతో వ్రాసుకొని రేపు పన్నెండుగంటలకు కోర్టుకు హాజరు కావలసిందని చెప్పి మమ్మల్ని విడిచేసరికి రాత్రి తొమ్మిదిగంటలయింది.

శాస్త్రి మనకర్మం ఎట్లా కాలిందో చూశావా. సినీమా లేదు. ఈ యమభటుల చేతుల్లో పడ్డాము: పావలా పారేస్తే కొంతపోయినా, సినీమా చూశేవాళ్ళం. రేపు కోర్టుకు రావలసిన అవసరం ఉండేదికాదు అన్నా. శాస్త్రి లేనికోపం తెచ్చుకొని యిందుకనే మనదేశం యింత అధోగతి పాలౌతోంది అని కేకలు వేయటం ప్రారంభించాడు.

మరునాడు మధ్యాహ్నం కోర్టులో—

షోడాకొట్టువద్ద పోలీసువాడు అడిగిన లంచం సంగతి అదీ బయటపెట్టాడు శాస్త్రి.

సరే ఒకరూపాయి జరిమానా చెల్లించి వెళ్ళు అని శాస్త్రితో చెప్పి పోలీసును తిట్టటం ప్రారంభించాడు మేజస్ట్రీటు తరువాత కొన్నాళ్ళకు విచారించగా ఆ పోలీసుకు ఒకనెలజీతం జరిమానా వేశారని తెలిసింది.